# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 19, ఫిబ్రవరి, 2015

తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్దంగా ఉన్నట్లు జిందాల్ కంపెనీ ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పారిశ్రామిక విధానం చాలా ప్రోత్సాహకరంగా ఉన్నదని కంపెనీ ప్రతినిధులు అన్నారు. జిందాల్ సా లిమిటెడ్ సిఇఓ కమ్ డైరెక్టర్ నీరజ్ కుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మనీష్ కుమార్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రాజీవ సింగ్ గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును కలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకునే అవకాశం కల్పించాలని కోరారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మంచినీటి పథకానికి అవసరమయ్యే పైపులను సరఫరా చేయడానికి సంసిద్దత వ్యక్తం చేశారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో తమకు పైపుల తయారీ లొకేషన్లు ఉన్నాయని, దేశంలో పైపుల తయారీలో తమదే అగ్రస్థానమని వారు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా కోరుకుంటే ఆ విధంగా పైపులు సరఫరా చేయడానికి సిద్దంగా ఉన్నామని, తయారీ కేంద్రాన్ని కూడా తెలంగాణలోనే నెలకొల్పుతామని ముఖ్యమంత్రికి చెప్పారు. ఉక్కు పరిశ్రమల స్థాపనలో కూడా తమకు అనభవం ఉన్నదని, తెలంగాణలో ఉక్కు పరిశ్రమ స్థాపించే అవకాశం ఇవ్వాలని కోరారు. వరంగల్-ఖమ్మం జిల్లాల సరిహద్దులోని బయ్యారం ప్రాంతంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సేయిల్ కూడా ముందుకు వస్తున్నదని, ఏదేని కారణాల వల్ల సేయిల్ సకాలంలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పకపోతే సిద్దంగా ఉండాలని ముఖ్యమంత్రి జిందాల్ ప్రతినిధులకు సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, వాటిలో జిందాల్ లాంటి కంపెనీలు భాగస్వాములు కావడానికి ముందుకు రావడం శుభపరిణామమని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ మంచినీటి పథకానికి

సంబంధించి జిందాల్ కంపెనీ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్నారు. త్వరలోనే నూతన పారిశ్రామిక విధానం ప్రారంభం అవుతుందని, అప్పుడు ఆయా కంపెనీల నుండి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పారిశ్రామిక విధానాన్ని తెలంగాణలో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు కావలసినంత భూమి, నీరు తెలంగాణలో అందుబాటులో ఉందని, విద్యుత్ ఉత్పత్తి కోసం చేస్తున్న ప్రయత్నాలు రెండేళ్లలో పూర్తి స్థాయిలో ఫలిస్తాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణ కూడా జరుగుతుందని, నగర శివార్లలో ఫార్మా సిటి, ఫిల్మ్ సిటి ఏర్పాటు కాబోతున్నాయని చెప్పారు. ఐటి పరిశ్రమ కూడా బాగా విస్తరిస్తున్నదని, ఎరో స్పేస్ పరిశ్రమలు కూడా ఇక్కడ ప్రారంభం అవుతున్నాయన్నారు. రాబోయే కొద్ది నెలల్లోనే తెలంగాణ రాష్ట్రంలో ఇబ్బడి ముబ్బడిగా పరిశ్రమల స్థాపన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో జిందాల్ కంపెనీ భాగస్వామ్యం కావాలని కోరారు.

సమావేశంలో సిఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.నర్సింగరావు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం